

ఆటో డ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సురేష్‌రెడ్డి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఆటో కార్మికునికి ఇన్సూరెన్స్, లైసెన్సు, రికార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆటో డ్రైవర్లు ఖాకీ డ్రెస్సు తప్పక వేసుకోవాలని సూచించారు. ఆటో నడిపే సమయంలో మద్యం, గంజాయి, సారా, సెల్‌ఫోన్‌లో మాట్లాడడం వంటివి చేయరాదన్నారు. ఆటో కార్మికులు ప్రయాణికులతో సత్ప్రవర్తనతో ఉంటూ కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకుని ఆటో నడుపుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్. భైరవ ప్రసాద్, సిపిఐ పట్టణ, మండల కార్యదర్శులు పిడుగు మస్తాన్, రవికుమార్, అధిక సంఖ్యలో ఆటో కార్మికులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టికెట్ల కోసం కసరత్తు



లోకేష్ పాదయాత్ర తర్వాత సర్వే బృందాలు
ఆరు అసెంబ్లీలపై నిశిత పరిశీలన
దసరా నాటికి ఉమ్మడి జిల్లాలో స్పష్టత

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల సమరానికి రెండు ప్రధాన పార్టీలు కసరత్తును వేగవంతం చేస్తున్నాయి. నిత్యం జనం మధ్యల్లో ఉండే కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ఎన్నికల బరిలో దింపే అభ్యర్థులపైన స్పష్టత కోసం దృష్టి పెట్టాయి. అధికార వైసిపి ఉమ్మడి కడపలో సిట్టింగులకే టికెట్ ఖరారు చేసే అవకాశం కనిపిస్తోంది. వీటిపై ప్రత్యేక కసరత్తు చేయాల్సిన అవసరం కనిపించడంలేదు. ఆ పార్టీ కూడా అభ్యర్థుల ఎంపిక అనే అంశాన్ని పెద్దగా పట్టించుకోలేదు. ఏదో ఒక ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఉండేలా ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోంది. ఇక ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీకి ఉమ్మడి జిల్లాలో అభ్యర్థుల ఖరారు తలనొప్పిగా మారింది. జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాల్లో ఇప్పటి వరకు జమ్మలమడుగు, పులివెందుల మినహా ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేయాల్సింది. వీటిలో కమలాపురం, మైదుకూరు నియోజకవర్గాల అభ్యర్థులపై స్పష్టత ఉన్నా ప్రకటించాల్సి ఉంది. మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో ఒకరికి మించి ఇద్దరు, ముగ్గురు, నలుగురు కూడా టికెట్ కోసం ప్రయత్నం చేస్తుండంతో ఎవరికి టిక్కెట్ ఇవ్వాలన్నది అధిష్టానానికి తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలో సర్వేలకు ప్రధానం ఇస్తోంది. లోకేష్ పాదయాత్ర తర్వాత జిల్లాలో తెలుగుదేశం పార్టీ సర్వే బృందాలు పార్టీ పరిస్థితులు, జనంలో తెలుగుదేశం పార్టీకి ప్రాధాన్యం ఏమేరకు పెరిగింది, ఈ అంశాలకు జిల్లాలో ప్రాధాన్యం ఇవ్వాలి, ఇలాంటి అంశాలతో సర్వే చేస్తున్నప్పటికీ ఆరు నియోజకవర్గాల్లో అభ్యర్థులపైన కూడా సర్వే బృందాలు నిశిత పరిశీలన కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు సమాచారం. ఈ సర్వే ఆధారంగా అధినేత చంద్రబాబుకు జిల్లాలో నాయకులపైన, జిల్లా పట్ల ఉన్న అభిప్రాయంతో అభ్యర్థుల ఖరారుకు తుదిరూపం ఇచ్చి దసరా నాటికి అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులపై స్పష్టత ఇచ్చే పనిలో ఉన్నట్లు సమాచారం.

ఆ ఆరు చోట్లా పోటా పోటీ

ఉమ్మడి జిల్లాలోని ఆరు నియోజకవర్గాలైన ప్రొద్దుటూరు, బద్వేలు, కడప, రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి అసెంబ్లీ నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ టిక్కెట్లకు పోటా పోటీ ఏర్పడింది. ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉంది. ఈ ఆరు చోట్ల అభ్యర్థిత్వాలపై సరైన స్పష్టత కనిపించకపోవడంతో టిడిపి కార్యకర్తలు కూడా అయోమయంలో ఉన్నారు. ఏ నాయకుడు వద్ద పని చేయాలో తెలియక గ్రూపు రాజకీయాలతో నలిగి పోవాల్సి వస్తోంది. ఈ నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించడం టిడిపికి అంత సులువైన అంశం కాదు. అభ్యర్థిగా అవకాశం దక్కని వారు అసంతృప్తికి గురికావడం, పార్టీకి నష్టం కలిగించే అవకాశాలకు దారితీసే పరిస్థితి ఎదురు కావడం లాంటి పరిణామాలు ఎదురవుతాయన్న ఆందోళన పార్టీలో కనిపిస్తోంది. రాజంపేటకు మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు టికెట్ రేసులో ముందు వరుసలో ఉండగా రాయచోటికి చెందిన ప్రముఖ విద్యా సంస్థల అధినేత జగన్మోహన్‌రాజు గట్టి ప్రయత్నంతో ఉన్నారు. టికెట్ పై ధీమా కూడా వ్యక్తం చేస్తున్నారు. రైల్వేకోడూరులో గత ఎన్నికల్లో పోటీ చేసిన పంతగాని ప్రసాదు ఆశావహుల్లో టిక్కెట్‌పై ఖచ్చితమైన ధీమాను వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ప్రధాన నాయకుడైన విశ్వనాథ నాయుడుకు ప్రసాద్‌కు సరైన సంబంధాలు కనిపించడం లేదు. ఇక్కడ నుండి మరో మహిళ అనితా దీప్తి టికెట్ రేసులో ఉన్నారు. రాయచోటిలో మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డితో పాటు మరో ఎమ్మెల్యే ద్వారకానాథ్‌రెడ్డి కూడా టికెట్ ఆశిస్తున్నారు. మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి టికెట్ కోసం గట్టిగా ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పార్టీ వ్యూహ కర్త రాబిన్ శర్మ టీం జిల్లాలో పర్యటిస్తున్నట్లు సమాచారం.

ప్రొద్దుటూరులోనూ అదే పరిస్థితి

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో టికెట్ తనకే అన్న ధీమాతో ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఉండగా టిక్కెట్టుపై మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కూడా నమ్మకంతో ఉన్నారు. మరో మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి ఆశావహుల్లో ఉండగా ఇటీవల కొద్ది రోజులుగా సిఎం సురేష్‌నాయుడు పార్టీలో క్రియాశీలకంగా మారారు. నలుగురిలో ఎవరు అభ్యర్థి అవుతారు అన్నది స్పష్టత రావాల్సి ఉంది.

కడపలో ఎవరు?

కడప అసెంబ్లీలోనూ ఎక్కువ మంది ఆశావహులున్నారు. అయినా ప్రధానంగా ఇద్దరు పేర్లు మాత్రమే వినిపిస్తున్నాయి. వీరిలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మిరెడ్డి కోడలు, కార్పొరేటర్ ఉమాదేవి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి సతీమణి మాధవి లతలున్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమీర్‌బాబు కూడా టికెట్ కోసం ప్రయత్నం చేస్తున్నారు. వీరిలో ఎవరిని అభ్యర్థిగా ఖరారు చేస్తారన్నది ఆ పార్టీలో ఉత్కంఠగా మారింది.

బద్వేలు బరిలో ఎవరికి చోటు

ఎస్‌సి రిజర్వుడ్ అసెంబ్లీ నియోజకవర్గంమైన బద్వేలులో కూడా ఆశావహులసంఖ్య ఎక్కువగా ఉంది. వీరిలో గత ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్ మొదటి వరుసలో ఉండగా ఇదే నియోజకవర్గంలోని పోరుమామిళ్ళకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి రోషన్ పేరు కూడా బాగా వినిపిస్తోంది. వీరు ఇరు వురే కాకుండా కడపకు చెందిన మాజీ గవర్నమెంట్ ప్రాసిక్యూటర్ గుర్రప్ప టికెట్ కోసం గట్టి ప్రయత్నం చేస్తున్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప



విసిలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

ప్రాధాన్యత రంగాలకు సంబంధించి అన్ని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుంచి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడక్ట్ అవార్డు, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమంలో ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఎస్‌టిజి ఇండికేటర్స్, విద్య, జగనున్నకు చెబుదాం తదితర అంశాలపై. అన్ని జిల్లాల కలెక్టర్ లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. సమావేశానికి కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు జెసి గణేష్ కుమార్ హాజరయ్యారు. విసి ముగిసిన అనంతరం సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను అన్ని అంశాలలో ముందంజలో నిలిపేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే క్షేత్రస్థాయిలో వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జిల్లాలో జరుగుతున్న ప్రాధాన్యత భవన నిర్మాణ పనుల్లో పురోగతి కనిపించేలా పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, అంగన్వాడీ, వైయస్సార్ క్లినిక్ లు, తదితర ప్రభుత్వ శాశ్వత భవన నిర్మాణాలపై దృష్టిని సారించి వెంటనే పనులు పూర్తి చేసి ఆయా శాఖలకు అప్పగించాలని పంచాయతీరాజ్ అధి కారులను ఆదేశించారు. నాడు–నేడులో భాగంగా జరుగుతున్న పనులను నిర్దేశిత లక్ష్యంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ విషయమై మండల స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో, ఇంజనీరింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సమావేశం నిర్వ హించి సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు వేగవంతంగా జరిగేలా చూడాల న్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు సక్రమంగా పనిచేయకపోతే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష, విద్యాశాఖ, ఐసిడిఎస్, మున్సిపల్, మైనర్ ఇరిగేషన్, ఎపిఇ డబ్ల్యుఐడిసి, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)



హత్యకు గురైన నాగేంద్రబాబు

మండలంలో దారుణ హత్య జరిగింది. శుక్రవారం తెల్ల వారుజామున మండలంలోని కొత్తపల్లి పంచాయతీ కానాపల్లి ఎస్‌సి కాలనీకి చెందిన ఆకుమల్ల నాగేంద్రబాబు (30) అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు గొంతుకోసి హత్య చేశారు. రాత్రి ఇంటిపై నిద్రిస్తున్న మృతుడు ఉదయం కిందికి రాకపోవడంతో అతని సతీమణి ఇమామ్‌బీ మిద్దెపైకి వెళ్లిచూడగా రక్తపు మడుగులో పడిఉన్న భర్తను చూసి కేకలు వేసింది. వెంటనే స్థానికులు తెలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాగేంద్రబాబు నాలుగేళ్ల కిందట షేక్ ఇమామ్‌బీని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వారికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడు గ్రానైట్ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తుండేవాడు. మృతదేహాన్ని రూరల్ పోలీసులు డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి దర్యాప్తు చేస్తున్నారు. ఇదీలా ఉండగా నాగేంద్రబాబు నెల కిందట తన తోటి కూలితోనూ, వారం కిందట తన స్వగ్రామంలోనే స్థానికులతో గొడవ పడినట్లు తెలిసింది. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పై రెండు కోణాల్లో విచారిస్తున్నారు.

బొప్పన సత్యనారాయణరావుకు నివాళులు

ప్రజాశక్తి - కడప



నివాళులర్పిస్తున్న 'శ్రీచైతన్య' సిబ్బంది

శ్రీ చైతన్య విద్యాసంస్థల ఫౌండర్, ఛైర్మన్ డాక్టర్ బొప్పన సత్య నారాయణరావు అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు. శుక్రవారం కడప కోటిరెడ్డి సర్కిల్‌లోని శ్రీ చైతన్య కళాశాలలో డీన్ బి. విజయభాస్కర్ రెడ్డి, అడ్మిన్ ఆఫీసర్ సి మనోజ్ కుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఎం రాజా, అధ్యాపక బృందం బొప్పన సత్యనారాయణ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పోరాటాలకు సంసిద్ధం కావాలి : ఎస్ఎఫ్ఐ

పోరుమామిళ్ల టౌన్ : ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ విద్యాసంస్థలను పెంచి పోసిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి విద్యార్థులను పోరాటాలకు సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. నాయకులు వీరపోగు రవి మాట్లాడుతూ కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల దోపిడీ రోజు రోజుకూ ఎక్కువైపోతుందని తెలిపారు. ముఖ్యనాయకుల సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల అధ్యక్షులుగా నగిరికంటి సందీప్, మండల కార్యదర్శిగా జాలా సుమంత్, ఉపాధ్యక్షులుగా వైష్ణవి, నవిత, వీరబపోగు వంశీ, వినయ్ కుమార్, షేక్ రఫీ, సహాయ కార్యదర్శులుగా మహాలక్ష్మి, నవీన్, గిరి, అశోక్ మండల కమిటీ సభ్యులుగా శివమణి, శివశంకర్ ,వెంకటేష్, తేజ్, , చరణ్, కౌశిక్, మానస, కరిష్మా, అర్చన, రమాదేవిని ఎన్నుకున్నారు.

టిడిపితోనే రాష్ట్ర భవిషత్తు : పుత్తా

వల్లూరు : బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసమే టిడిపి పార్టీ ఉద్భవించిందని తెలుగుదేశం ఉపాధ్యక్షుడు కమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుత్త నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తప్పెట్ల గ్రామపంచాయతీలో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి తెలుగుదేశం పార్టీ ఇచ్చే సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు వెళ్లారు. టిడిపి అధికారంలోకి వస్తే మినీ మేనిఫెస్టోను అమలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు లేబాక నాగేశ్వర్‌రెడ్డి, తాడిగోట్ల రాఘవరెడ్డి, మాజీ సర్పంచ్ కె. శ్రీనివాసుల రెడ్డి, టి. శ్రీనివాసుల రెడ్డి,టి. మల్లికార్జున రెడ్డి , గడికోట సుధాకర్ రెడ్డి, చల్ల సునీల్ కుమార్‌రెడ్డి , జె సుబ్బారెడ్డి, రామ సుబ్బారెడ్డి, సుబ్బరామిరెడ్డి , రఘునాథ్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి , నాగసుబ్బారెడ్డి, వెంకటసుబ్బరాయుడు, ఓబులేసు చిట్టిబాబు, సద్దాం హుస్సేన్ , టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అబద్ధాల సిఎంను గద్దె దింపడి : టిడిపి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అబద్ధాల ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డిని అధికారం నుంచి గద్దె దింపాలని తెలుగుదేశం పార్టీ జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని నీళ్ల ట్యాంకి వీధిలో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి ఇంటికీ తిరుగుతూ మినీ మ్యానిఫెస్టోను భూపేష్ రెడ్డి వివరించారు. ఆయన మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి విద్యుత్, బస్ ఛార్జీ, ఇంటి పన్నులు పెంచి, పేద, మధ్యతరగతి వారికి తీవ్ర అన్యాయం చేస్తున్నారని వాపోయారు. నియోజకవర్గం నుండి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, నవనీశ్వర్ రెడ్డి, రాయల్ కిరణ్, హరి రాయల్, ఓబుల్ రెడ్డి, శివ, దువ్వూరు మురళీ, ఐ.ఎల్ చిన్న, జయచంద్ర, ఫిలిప్, మస్తాన్, వెల్డింగ్ గైబు, హనుమంతు నాయక్, పీరా నాయక్ పాల్గొన్నారు.



పెద్దదర్గాలో ప్రార్థనలు చేస్తున్న సాయి ధరమ్‌తేజ్

పెద్దదర్గాలో హీరో సాయి ధరమ్‌తేజ్ ప్రార్థనలు

ప్రజాశక్తి–కడప అర్బన్

కడప నగరంలోని అమీన్‌పీర్ దర్గాలో శుక్రవారం ప్రముఖ సినీ హీరో సాయి ధరమ్‌తేజ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పూలచాదర్ సమర్పించారు. తేజ్‌కు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. దర్గా మత పెద్దలు అమీన్‌పీర్ దర్గా విశిష్టతను సాయిధరమ్‌తేజ్‌కు తెలియజేశారు. తొలిసారిగా తాను కడప పెద్దదర్గాను దర్శించుకుని ఆత్మసంతృప్తి పొందానని తేజ్ చెప్పారు. దర్గాను దర్శించు కోవడం చాలా సంతోషంగా ఉందని తేజ్ అన్నారు. హీరో సాయి ధరమ్ తేజ్‌ను చూసేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. అనంతరం దుర్గమ్మ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - కడప



నిరసన చేస్తున్న ఎన్ఎస్‌యుఐ నాయకులు

ఇంటర్ విదా ్యర్థులకు పాఠ్య పుస్తకాలు ఉచితంగా అందిం చాలని, కార్పొరేట్, ప్రయివేట్, ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో ఆర్ఐఒ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఉచితంగా ఇవ్వాలని, కార్పొరేట్, ప్రయివేట్ కళాశాలల్లో ఫీజుల దోపిడీని అరిక ట్టాలని అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అందరికీ చదువు కునేందుకు పాఠ్యపుస్తకాలు ఇచ్చిందన్నారు రాష్ట్రంలో 439 ప్రభుత్వ, 131 ఎయిడెడ్ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులలో నూటికి 70 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులే ఉన్నార న్నారు. తాగునీరు, మరు గుదొడ్లు, ఫర్నిచర్, ల్యాబ్, లైబ్రరీ, తరగతి గదుల కొరత, లెక్చరర్ల లేమి వంటి సమస్యలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నగర అధ్యక్షులు శ్రీహరి, ఫర్రోక్, మహేష్, తేజ, విజయ్, రాజు, ప్రసాద్ జాకీర్, శ్రీకాంత్, నాగేంద్ర, సుబ్బయ్య, శివ పాల్గొన్నారు.

వాలంటీర్లను కించపరచడం తగదు

కలసపాడు : జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వాలంటరీ వ్యవస్థను తప్పుబట్టడం, వారిని కించపరచడం తగదని జెసిఎస్ మండల కన్వీనర్ చిత్తా రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపిపి భాస్కర్‌రెడ్డి, మహానందిపల్లె సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్ నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్‌కల్యాణ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాలంటీర్లు అందరూ ఐక్యమత్యంతో కలిసి పోరాడాలని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం కోసం, ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో వాలంటరీ వ్యవస్థను తీసుకొచ్చారని చెప్పారు. అలాంటి వ్యవస్థపై బురదజల్లడం హేయనీయమన్నారు. వెంటనే వాలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సామాజిక సేవలు అభినందనీయం

కడప : కువైట్ ప్రవాసాంధ్ర రెడ్డి సంఘం సామాజిక సేవలు అభినందనీయమని జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. ప్రమాదంలో కాలు విరిగి చికిత్స కోసం వచ్చిన శివరామిరెడ్డికి శుక్రవారం కువైట్ ప్రవాసాంధ్ర రెడ్డీస్ సంఘం తరపున కడపలో నిర్వహించిన కార్యక్రమంలో జడ్‌పి చైర్మన్ చేతుల మీదుగా రూ. 50 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవాసాంధ్ర రెడ్డీస్ సంఘం సేవలు అభినందనీయమని అన్నారు. తమ కుటుంబ సభ్యుల ఉజ్వల భవిష్యత్తు కోసం కువైట్ వెళ్లిన రెడ్డీస్ సామజిక వర్గానికి చెందిన యువకులు కుల మతాలకు అతీతంగా సామాజిక సేవ చేయాలనే మంచి ఉద్దేశంతో సంఘం ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని అన్నారు. బాధితుడు శివరా మిరెడ్డి మాట్లాడుతూ ప్రమాదం జరిగి కష్టాలో ఉన్న తనకు ఆర్థిక సాయం చేసిన సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రెడ్డీస్ సంఘం గౌరవ అధ్యక్షుడు ముమ్మడి వెంకటసుబ్బారెడ్డి, ప్రధాన సలహాదారులు మూలపల్లి రమణారెడ్డి, సలహాదారుడు పోలి గంగిరెడ్డి, గల్ఫ్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ బి.హెచ్. ఇలియాస్ పాల్గొన్నారు.

నేడు చెన్నూరు మండల సర్వసభ్య సమావేశం

చెన్నూరు : మండల సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపిడిఒ సభా భవనంలో శనివారం ఉదయం 10.30 గంటలకు ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ సురేష్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశంలో తాగునీరు, విద్య, వైద్యం, రెవెన్యూ, ఉపాధి, సచివాలయాలు, ఆర్‌అండ్‌బి, డ్వాక్రా, జగనన్న గృహాలు వంటి వాటిపై చర్చిస్తామన్నారు.

యాజమాన్య హక్కులు కల్పించడం సరికాదు : వ్య.కా.స

ప్రజాశక్తి - కడప అర్బన్

అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించడం వల్ల భూస్వాములకు పెత్తందారులకు మాత్రమే ప్రయోజనం కలుగుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి. శివకుమార్ వి.అన్వేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసైన్డ్ భూములు గ్రామాలలో అర్హుల వద్ద పది శాతం కూడా లేవని, 90 శాతం అనర్హులకు, అధికారంలో ఉన్న పార్టీల నాయకులకు కట్టబెట్టారని తెలిపారు. జిల్లాలో రెండు లక్షల ఎకరాలపైగా అన్యాక్రాంతమైయ్యాయని చెప్పారు. కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల, బి.కోడూరు, అట్లూరు, బ్రహ్మంగారిమఠం, సిద్ధవటం, ఒంటిమిట్ట, పెండ్లిమర్రి, ఖాజీపేట, మైదుకూరు, దువ్వూరు మండలాలలో స్థానిక ఎంపీపీలు, సర్పంచ్‌లు మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యే బంధువులు, ఎమ్మెల్సీ బంధువులు, జెడ్పిటిసిలు స్థానిక చైర్మన్లు మేయర్లు డబ్బున్న వాళ్లు స్థానికేతర్లు ప్రభుత్వ భూములు ఆక్రమించుకొని దర్జాగా ఎస్టేట్లు ఏర్పాటు చేసుకుని అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే అసైన్డ్ చట్టసవరణను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం ఇతర ప్రజాసంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకోవడంలో రెవెన్యూ యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం వైఫలమైందని విమర్శించారు.

టిడిపి ఎస్‌టి సెల్ పార్లమెంట్ జిల్లా ఉపాధ్యక్షులుగా రాజానాయక్

ప్రజాశక్తి - వేంపల్లె



చంద్రబాబుతో రాజానాయక్

మండలంలోని బక్కన్నగారిపల్లె గ్రామానికి చెందిన మూడే రాజా నాయక్‌ను టిడిపి ఎస్టీ సెల్ పార్లమెంటు జిల్లా ఉపాధ్యక్షులుగా టిడిపి రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు శివేరి దున్నదొర నియమించారు. ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడుగా పదవి వచ్చేందుకు సహకరించిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు, రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు శివేరి దున్న దొర, రాష్ట్ర ఎస్టీ సెల్ నాయకులు దారు నాయక్, జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి, పులివెందుల ఇన్ ఛార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం బాధ్యత అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. తన పదవికి న్యాయం చేయడంతో పాటు టీడీపీ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని రాజా నాయక్ తెలిపారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

ప్రజాశక్తి - కడప అర్బన్



నారాయణ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

హౌసింగ్ బోర్డు కాలనీలోని నారాయణ స్కూల్ ప్రిన్సిపల్ గీతా ఆధ్వర్యంలో పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ విద్యార్థులతో కలసి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. రాజీవ్ పార్క్ స ర్కిల్ నుంచి మహావీర్ సర్కిల్ వరకు సాగింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒక్కొక్కరు ఒక్కో మొక్క పట్టుకుని ర్యాలీని కొనసాగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గీత మాట్లాడుతూ ఏజీఎం చెన్నకేశవ రాజు, ఆర్ఐ కిరణ్ కుమార్ అదేశాల మేరకు ర్యాలీ నిర్వహించామని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి ఒక చెట్టును నాటాలని పిలుపునిచ్చారు.

యువతలో నైపుణ్యం ముఖ్యం

కడప అర్బన్ : ఐక్యరాజ్యసమితి, దాని ఉనికిని ప్రకటించిన తర్వాత 2014 నుంచి ప్రతి సంవత్సరం జూలై 15న ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం నిర్వహించుకుంటారని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ సుబ్బరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం యువతకు క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రపంచం మెల్లగా సుస్థిర అభివృద్ధి వైపు మళ్లుతున్న నేపథ్యంలో యువతలో నైపుణ్యం పెంపొందించడం చాలా ముఖ్యమన్నారు. శిక్షణ పొందుతున్న విద్యార్థిని, విద్యార్థులకు వివిధ అంశాల మీద ఎస్ఎ కాంపిటీషన్, మ్యూజికల్ చైర్స్, ఖోఖో, కబడ్డీ పలు పోటీలను నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తేజ,నరసింహ, అలీ, కల్యాణి పాల్గొన్నారు

అందుబాటు ధరలతో నాణ్యమైన సరుకులు : జెసి

కడప : పెరుగుతున్న బియ్యం ధరల దృష్ట్యా అందుబాటు ధరలతో నాణ్యమైన సరుకులను అందజేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు కడప రైతు బజార్లో ఈనెల 15 నుంచి ప్రత్యేక కౌంటర్ ను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ తెలిపారు. నాణ్యమైన బియ్యం కిలో రూ .48, కందిపప్పు ఇవ్వనున్నట్లు తెలిపారు. కౌంటర్ కడప జిల్లా రైస్ మిల్లర్ల వారిచే నిర్వహించబడుతుందని తెలిపారు. ప్రజలందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వినియోగదారులు ఆధార్ కార్డును తప్పనిసరిగా తీసుకెళ్లాలని తెలిపారు. కడప జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలోనూ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

వాహనదారులకు పత్రాలు తప్పనిసరి

ఖాజీపేట : ప్రతి వాహనదారుడూ వాహనాలకు సంబంధించి పత్రాలను తప్పక కలిగి ఉండాలని ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ రహదారి టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలకు సంబంధించి సరిగ్గా పత్రాలు లేని వాహన యజమానులకు జరిమానా విధించారు. ప్రతి ఒక్కరూ వాహనానికి సంబంధించి తప్పక పత్రాలను కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించినప్పుడే ప్రమాదాలను నివారించగలమని ఆయన అన్నారు.

చేనేత హస్త కళలను ఆదరించండి

ప్రజాశక్తి - కడప అర్బన్



ప్రదర్శన అమ్మకాలను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్

శ్రీ కళాజ్యోతి హాండ్స్ క్రాఫ్ట్ వెల్ఫేర్ సొసైటీ వారి హస్తకళ, చేనేత ప్రదర్శన అమ్మకాలను ప్రజలు ఆదరించాలని డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి కోరారు. శుక్రవారం మద్రాస్ రోడ్‌లోని టిటిడి కల్యాణ మండపంలో ప్రదర్శన అమ్మకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రఖ్యాత చేనేత వస్త్రాలు డ్రస్ మెటీరియల్ బెడ్ షీట్స్ హస్త కళా వస్తువులు అందుబాటులోకి తీసుకురావడం అభిన ందనీయమన్నారు. ఈనెల 30వ వరకు ప్రదర్శనలు అమ్మకాలు ఉంటాయని తెలిపారు. సొసైటీ సెక్రటరీ వెంకయ్య మాట్లాడుతూ రోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అమ్మకాలు ఉంటాయని తెలిపారు. హైదరాబాద్ బ్లాక్ ప్రింటింగ్ శారీస్, బెంగాలీ కాటన్, మంగళగిరి నారాయణపేట, ధర్మవరం, పోచంపల్లి, మధ్యప్రదేశ్, టస్కర్, భాగలాపురి సిల్క్ చీరలు, లక్నో చికెన్ చీరలు ప్రదర్శనలో ఉన్నాయని చెప్పారు. డ్రెస్ మెటీరియల్ కలంకారి, మంగళగిరి, చీరాల, పోచంపల్లి, నారాయణపేట, నారాయణ వనం మొదలైనవి అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. బెడ్ షీట్స్ హస్త కళా వస్తు వులు ప్రజలకు అందుబాటులో ఉంచామని, సందర్శించి చేనేతలను ఆదరించాలని కోరారు.

ముగిసిన సాంకేతిక శిక్షణ

ప్రజాశక్తి- కడప అర్బన్



ఎంఇఒను సన్మానిస్తున్న కె ఎస్ఆర్ఎం సిబ్బంది

ప్రభుత్వ ఉపాధ్యాయులకు రెండు వారాల పాటు నిర్వహించిన సాంకేతిక శిక్షణ కార్యక్రమం శుక్రవారం కెఎస్ ఆర్ ఎం ఇంజినీరింగ్ కళా శాలలో ముగి సింది. ముఖ్య అతిథిగా ఎంఇఒ నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ప్రతి పేద విద్యార్థికీ సాంకేతిక శిక్షణ ద్వారా విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే ముఖ్య లక్ష్యం అన్నారు. ప్రభుత్వం నూతనంగా డిజిటల్ విద్యనూ ప్రోత్సహిస్తూ ఉత్తమ బోధనకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలను విద్యాశాఖ అధికారులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పర్యవేక్షణ ఆఫీసర్ వి. రమణ మూర్తి, సంయుక్త కోఆర్డినేటర్లు సి. రమణ మూర్తి, కె. ఇమామ్ ఖాసీం, కె ఎల్ ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎమ్. వి. రత్నమ్మ, సాంకేతిక నిపుణులు డాక్టర్ వి. వెంకట రమణ, శిక్షణ ఇచ్చే సిబ్బంది పాల్గొన్నారు.

తపాలా కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ

కడప అర్బన్ : కర్నూల్ రీజియన్ పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ కె.శేషారావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోస్టల్ సూపరింటెండెంట్ కిరణ్, ఎఎస్‌పిలు విజయభాస్కర్, రమాశంకర్, అహమ్మద్ హుస్సేన్, రెడ్డిబాస, పోస్ట్ మాస్టర్ సునీతాదేవి, ఐపిపిబి మేనేజర్ విష్ణువర్ధన్, పిఎల్ఐ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పి.మునాఫ్ ఆయనతో ఉన్నారు. ఈ సందర్భంగా పోస్టుమ్యాన్‌లతో సమావేశమై ఉత్తరాల పంపిణీ బాగా ఉండాలని పేర్కొన్నారు. ప్రతి పోస్టు మ్యాన్ ఐపిపిబి ఖాతాలను తప్పకుండా తెరవాలని చెప్పారు.



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ

అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి సంక్షేమ పథకాలు ప్రజల చెంతకు చేరుస్తున్నారని, పులివెందుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని ఎంపీ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం ఆయన కణంపల్లెలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. గడప గడప కార్యక్రమంలో ఆయన ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగారు. కదిరి కొత్త రోడ్డు నుంచి పాత రోడ్డు మీదుగా కడప రోడ్డు కలిసేలా ఒక కొత్త రోడ్డును నిర్మించాలని గ్రామస్తులు ఎంపీని కోరారు. ప్రస్తుతం కదిరి వైపు నుంచి వచ్చే వాహనాలు కడప రోడ్డుకు వెళ్లాలంటే వెళ్లకుండా పాత గ్రామం మీదుగా కడప రోడ్డుకు వెళుతున్నారని దీనివల్ల తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో చిన్న వీధులుండడం వల్ల పెద్ద పెద్ద వాహనాలు వెళ్తున్నప్పుడు దుమ్ము ధూళి ఇళ్లల్లోకి ఎక్కువగా వస్తోందని మహిళలు తెలిపారు. కణంపల్లెలోని బీసీ కాలనీలో కొత్తగా ఒక రామాలయాన్ని నిర్మించాలని ఎంపీని కాలనీవాసులు కోరారు. స్పందించిన ఆయన అక్కడికక్కడే అధికారులను కొత్త రోడ్డు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బలరామిరెడ్డి, ఓబులరెడ్డి, పుష్పనాథరెడ్డి, సర్పంచులు భాస్కర్ రెడ్డి, రామాంజనేయులు, గ్రామస్తులుపాల్గొన్నారు.



గుంత పూడ్చిన అధికారులు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక పాత బస్టాండు కూడలిలో ప్రమాదకరంగా నడి రోడ్డుపై ఏర్పడిన గుంతను శుక్రవారం అధికారులు మరమ్మతులు చేసి పూడ్చారు. ఈనెల 12న ప్రజాశక్తి పత్రికలో ప్రచురితమైన 'ప్రమాదకరంగా నడి రోడ్డుపై గుంత' అనే శీర్షికన కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. అందుకు అధికారులు స్పందించి గుంత పూడ్చారు. నామ మాత్రంగా ఎర్రమట్టితో గుంతను పూడ్చారు.గుంత పూడ్చడంతో ప్రయాణికులు, వాహనదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

నిరుద్యోగ యువతకు ద్రోహం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

నిరుద్యోగ యువతకు ద్రోహం చేయడంలో కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు దొందు దొందేనని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా దాదాపు 10 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా మోడీ ప్రభుత్వం నిరుద్యోగులకు అన్యాయం చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.50 లక్షల రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. వైసిపి ప్రభుత్వం కూడ భర్తీ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలిపారు. జగన్ ప్రభుత్వం పారిశ్రామిక వ్యతిరేక చర్యల వల్ల ప్రయివేటు రంగంలో ఉద్యోగాలు రావడం లేదని తెలిపారు. నిధులు లేని కారణంగా ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ కార్పొరేషన్లు స్వయం ఉపాధి పథకాలను అమలు చేయడం లేదన్నారు. ఖాళీగా ఉన్న 10 వేల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న 2.50 లక్షల ఉద్యోగాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం త్వరలో భర్తీ చేయాలని కోరారు. ప్రయివేటు రంగంలో ఉపాధి ఉద్యోగాలు, స్వయం ఉపాధి పథకాలు కూడా ఎక్కువగా పెంచాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల ఉద్యోగకాలం గరిష్ట పరిమితి 62 ఏళ్ల నుంచి 60 సంవత్సరాలకు తగ్గించాలని కోరారు.

సబ్సిడీ ధరలకు టమోటాలు విక్రయించాలి

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలో సబ్సిడీ ధరలకు ప్రజలకు టమోటాలను విక్రయించాలని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరణాల శివ నారాయణ తెలిపారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ప్రజలకు అందుబాటులో లేని విధంగా ధరలు విపరీతంగా టమోటాలు ఉన్నాయన్నారు. మార్కెట్‌లో కిలో రూ. 130 నుంచి రూ.160 ఉందని చెప్పారు. నిత్యావసర ధరలు ప్రజలకు అందుబాటులోకి తేవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు విఫలం చెందాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం టమోటాలను ప్రజలకు సబ్సిడీ కింద మార్కెట్లో తక్కువ ధరలకు టమోటాలను అందించాలని కోరారు. సమావేశంలో ప్రసాద్ రెడ్డి, కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్లను అందజేయాలి

జమ్మలమడుగు రూరల్ : రైతులకు వ్యవసాయ పనిముట్లు 40 శాతం సబ్సిడీతో ఇవ్వాలని వ్యవసాయ శాఖ మండల కమిటీ సభ్యులు కోరారు. శుక్రవారం వ్యవసాయ బోర్డు సమావేశం వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యానపంటలకు సంబంధించి చీని, పత్తి పంటలకు బీమాను ప్రభుత్వం మండలానికి సుమారు రూ. 2 కోట్లకుపైగా అందజేసిందని చెప్పారు. సమావేశంలో బోర్డు సభ్యులు తిరుపతి రెడ్డి, శంకర్, గురుమూర్తి యాదవ్, రామకృష్ణ, ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

మురుగు నీటితో సహవాసం

రోడ్లపై ఏరులై పారుతున్న వైనం
ఆందోళనలో ప్రజలు
పట్టని అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని 10వ వార్డు అయిన గడికోట రషీద్ వీధిలోని ప్రజలు మురుగు నీటితో సహవాసం చేస్తున్నారు. ఈ వీధిలోని ప్రజలు, ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వీధిలో తమ ఇంటి ముందు నీరు ప్రవహించకుండా ఎత్తుగడ్డలు ఏర్పాటు చేసుకోవడంతో మురుగునీరంతా రోడ్డుపైనే నిరంతరమూ ప్రవహిస్తూనే ఉంటుంది. అందులో రోడ్డుపైనా బోకులు తోమడం, బట్టలు ఉతక్కోవడంతో నీరంతా రోడ్డుపై నిలబడుతోంది. పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు ప్రకటనలే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పట్టణంలో ఎక్కడెక్కడ ఇటువంటి పరిస్థితులు ఉన్నాయో పరిశీలించి అక్కడి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఎంతైనా ఉంది. వీధి చివరన ప్రధాన కాలువ ఉన్నప్పటికీ రోడ్డు వెంబడి ప్రవహించే నీరు ఆ కాల్వలోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆలోచనలు కూడా అటు నాయకులు కానీ, ఇటు అధికారులు కానీ చేయడం లేదు. ఇళ్లలోని చెత్తను వీధి చివరన కుప్పగా వేయడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. నగర పంచాయతీ కార్మికులు ప్రతి ఇంటికీ వెళ్లి చెత్తన సేకరిస్తున్నారని అధికారులు చెబుతున్నప్పటికీ, ఆ ప్రాంతంలో రోడ్లపైనే చెత్తను ఎందుకు వేస్తున్నారో అర్థంకాని పరిస్థితి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి ప్రజలకు అందించిన డస్ట్‌బిన్లు వృథా అని చెప్పవచ్చు. వర్షాకాలం సంరక్షణ, పరిసరాల శుభ్రత వంటి అంశాలకు సంబంధించిన కార్యక్రమాలను ప్రధాన రోడ్ల వెంబడి తూతూ మంత్రంగా కాకుండా, వీధులలోని ప్రజలకు ముఖ్యంగా మహిళలకు అర్థమయ్యేలా కార్యక్రమాలు నిర్వహించాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రజలు కూడా తమ ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని పరిసరాలను 'శుభ్రంగా ఉంచుకోవాలి. ఏది ఏమైనా రోడ్ల వెంబడి మురుగునీరు ప్రవహించకుండా మురుగు కాలువలు నిర్మించడం లేదా ప్రత్యామ్నాయ మార్గాలు చూసి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని ప్రజాప్రతినిధులను, అధికారులను కోరుతున్నారు.



రోడ్డుపైనే దర్శనమిస్తున్న చెత్త, ప్రవహిస్తున్న మురుగునీరు

'జగనన్న సురక్ష'తో సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

జగనన్న సురక్ష కార్యక్రమంతోనే పేద లకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా, నగర మేయర్ కె.సురేష్ బాబు సంయుక్తంగా అన్నారు. శుక్రవారం నగరంలోని 36, 37,50వ డివిజన్లలోని సచివాలయాల్లో 'జగనన్న సురక్ష' శిబిరాలను నిర్వహించారు. సర్వీస్ రిక్వెస్ట్ స్పాట్ రిజిస్ట్రేషన్, దరఖాస్తుల పరిశీలన కౌంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అంజాద్ బాషా మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ బంగారు నాగయ్య, వైస్ చైర్మన్ ఇబ్రహీం మియా, స్థానిక కార్పొరేటర్లు ఇతర కార్పొరేటర్లు షేక్ మహమ్మద్ షఫీ, నాయకులు నరపురెడ్డి సుబ్బారెడ్డి, రమేష్ రెడ్డి సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వై.ఎస్. మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని ప్రశాంతినగర్ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫిజ్, కమిషనర్ నరసింహారెడ్డి, కౌన్సిలర్ కమలమ్మ, మెప్మా పీడీ సురేష్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, జగనన్న కన్వీనర్లు, సారథుల ఇన్‌ఛార్జి చంద్ర మౌళి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **చాపాడు :** జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు లబ్ధి చేకురుతుందని ఎంపిపి టి. లక్ష్మయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎన్.ఓబాయపల్లెలో శుక్రవారం జగనన్న సురక్ష గ్రామసభను నిర్వహించారు. 274 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాధా కృష్ణ వేణి, డిటి భవానీ, ఎఒ మ్యాగీ, వైసిపి నాయకులు రామ్మోహన్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, జయరామిరెడ్డి, సర్పంచ్ అంజనమ్మ, ఎంపీటీసీ ఈశ్వరమ్మ, మాజీ జడ్పీటీసీ గంగులయ్య, రవి, రామచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనువాసుల రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైసిపి మండల కన్వీనర్, మండల ఉపాధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కోరుకుంటపల్లి సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జగనన్న గృహసారథుల మండల కన్వీనర్ విజయ భాస్కర్ రెడ్డి, ఎంపీడీవో కృష్ణమూర్తి, డిప్యూటీ తహశీల్దార్ వెంకటరెడ్డి, సర్పంచ్ సిలార్, వివిధ శాఖల అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు. **చక్రాయపేట :** ఎంపీడీవో శివారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం చిలేకంపల్లి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం ఎంపిడిఒ శివారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ రకాలైన ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి శివప్రసాద్‌రెడ్డి, ఎంపిటిసి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. **దువ్వూరు :** మండల పరిధిలోని కృష్ణంపల్లి సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మైదుకూరు శాసనసభ్యులు శెట్టిపల్లి రఘురామిరెడ్డి హాజర య్యారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జగదీశ్వర్‌రెడ్డి, తహశీల్దార్ రమాకుమారి, ఎంపిపి కానాల జయచంద్రరెడ్డి, జడ్‌పిటిసి కృష్ణయ్య, సర్పంచ్ మెరువ నాగులు ,మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** పట్టణ పరిధిలోని 14,15 కౌన్సిల్ వార్డులకు సంబంధించి 7వ సచివాలయంలో మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న సురక్ష క్యాంపును నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి హాజరై అర్హులైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆర్ఎస్ జంషీద్, హేమలత, జిల్లా విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ షాహిద్, ఆర్ఒ గంగిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటికి ఆరుగురు విద్యార్థులు ఎంపిక



విద్యార్థులకు స్వీట్లు తినిపిస్తున్న హెచ్‌ఎం

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్‌జెయుకెటి విడుదల చేసిన ట్రిపుల్ ఐటీ అర్హుల జాబితాలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం శివ నాగ మునెమ్మ చెప్పారు. పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడంతో 2023 - 24 విద్యా సంవత్సరంలో ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో ఆడ్మిషన్లు పొందేందుకు తమ పాఠశాలకు చెందిన శివ గణేష్, సుబ్రహ్మణ్యం, వెంకటసాయి, చైతన్య కుమార్, శశి కుమార్, ఖాసిఫ్ అభిబ్ అనే విద్యార్థులు మొదటి జాబితాలోనే ఎంపిక అయినట్లు చెప్పారు. ప్రయివేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా చదువులో ముందు ఉంటారని తమ పాఠశాల విద్యార్థులు నిరూపించినట్లు చెప్పారు. రెండో జాబితాలో స్పోర్ట్స్ కోట, ఎన్‌సిసి కోటా కింద తమ పాఠశాలకు చెందిన మరి కొందరికి సీట్లు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు ట్రిపుల్ ఐటీలకు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు హెచ్‌ఎం శివ నాగ మునెమ్మ, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్, బోధనేతర సిబ్బంది, ఉపాధ్యాయులు అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నతంగా రాణించి ట్రిపుల్ ఐటిలో అత్యుత్తమ స్థానాన్ని సాధించాలని కోరారు.

ఇద్దరు విద్యార్థులు ఎంపిక

పులివెందుల రూరల్ : ప్రభుత్వ ఉన్నత పాఠశాల(మెయిన్)లో 10వ తరగతిలో ఉత్తీర్ణులైన కౌశిక్ అనే విద్యార్థి 573 మార్కులు, జ్ఞాపిక గౌరీ అనే విద్యార్థిని 561 మార్కులు సాధించారు. వీరు ట్రిపుల్‌ఐటికి ఎంపికయ్యారని శుక్రవారం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు లు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

క్రమశిక్షణతో కూడిన విద్య

ప్రభుత్వ ఉన్నత మెయిన్ పాఠశాలలో ఉపాధ్యాయులు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించారని విద్యార్థి కౌశిక్ తెలిపారు. ముఖ్యమంత్రి అన్ని వసతులు సమకూర్చారని విద్యార్థులు చెప్పారు. ఏ చిన్న సబ్జెక్టులో అర్థం కాకపోయినా ఉపాధ్యాయులను అడిగిన వెంటనే అర్థమయ్యే విధంగా బోధించారని తెలిపారు. , వారు చెప్పిన వాటిని ఆచరణలో పెట్టడం వల్లే పదవ తరగతిలో 573 మార్కులు సాధించామని చెప్పారు. ట్రిపుల్‌ఐటిలో సీటు రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

అర్థమయ్యేలా విద్యాబోధన..

ప్రభుత్వ ఉన్నత పాఠశాల మెయిన్‌లో అధ్యాపకులు ప్రతి విద్యార్థికీ అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేస్తున్నారని విద్యార్థి గౌరీ చెప్పారు. అన్ని మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని ఉపాధ్యాయులు చెప్పే అన్ని అంశాలపై తాము శ్రద్ధగా విని వాటిని పదవ తరగతి పరీక్షల్లో ఆచరణలో పెట్టడంతో 561 మార్కులు సాధించానని తెలిపారు. తనకు ట్రిపుల్ ఐటిలో సీటు రావడం ఆనందంగా ఉందని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకొస్తానని తెలిపారు. విద్యార్థిని జ్ఞాపిక గౌరీ అన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి



మరమ్మతులకు నోచని తాగునీటి బోరు పైప్‌లైన్

తాగునీటి పైపులైన్ లీకేజీ

వృథాగా పోతున్న నీరు - పట్టని అధికారులు

ప్రజాశక్తి - వేంపల్లె

తాగునీటి మోటర్‌కు చెందిన పైపులైనుకు లీకేజీ కావడంతో తాగునీరు రోడ్డు పాలు అవుతోంది. స్థానిక యూనియన్ బ్యాంక్ సమీపంలో ప్రజలకు తాగునీటికి అందించేందుకు బోరు వేశారు. బోరు వద్ద రబ్బరు బీడింగ్ దెబ్బ తినడంతో మోటర్ ఆన్ చేసినప్పుడు నీరు అంతా వృథాగా రోడ్డు వెంబడి పారుతున్నాయి. నీరు రోడ్డుపై పారడంతో పాదచారులకు ఇబ్బందిగా మారింది. మోటర్ వద్ద పైపులైన్‌కు చెందిన రబ్బర్ బీడింగ్ పోయిన తాగునీటిని సరఫరా చేసే సిబ్బంది వాటిని మరమ్మతులు చేయక పోవడంతో నీరు వృథాగా నేలపాలు అవుతున్నాయి. నీరు వృథాగా వెళ్తున్నా మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మోటర్ ఖాళీ పోవడంతో ఇటివలే రిపేరు చేశారు. అయినప్పటికీ వృథాగా పోతున్న నీటిని ఆరికట్టేందుకు ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఒక వైపు ఆయా ప్రాంతాల్లో నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. మరో వైపు చూస్తే నీరు వృథాగా రోడ్డు వెంబడి పారుతున్నాయి. మోటర్ వద్ద పైపు లీకేజీ కావడంతో నీరు పైకి ఎగిరి పడి అటు వైపు వెళ్లే పాదచారులపై నీరు పడుతోంది. ఇప్పటికైనా అధికారులు, పంచాయతీ వాటర్ సిబ్బంది స్పందించి వృథాగా పోతున్న నీటిని అరికట్టాలని, పైప్‌లైన్‌కు మరమ్మతులుచేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-పోరుమామిళ్ల

ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, థామస్‌రెడ్డి చిత్తా దంపతుల ఆధ్వర్యంలో వారి ప్రతినిధులు జి. శ్రీకాంత్ రెడ్డి, ఎల్. ప్రసాద్‌రెడ్డి మండలంలోని ప్రాథమిక పాఠశాలలైన ముద్దంవారిపల్లె, హృదయ పేట, కరణం వారి పల్లె, కలసపాడు మెయిన్, ఉర్దూ, పుల్లారెడ్డిపల్లె, తెల్లబాడు పాఠశాలల్లో చదువుతున్న బాల బాలికలు 520 మందికి 1500 నోటు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల పేద పిల్లలు చదువులో రాణించాలనే ఉద్దేశంతో ఇలాంటి ప్రోత్సాహక బహుమతులను విద్యార్థులకు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు హాజరై సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. **వేంపల్లెలో..** స్థానిక భవిత కేంద్రంలో విద్యా భ్యాసం చేస్తున్న విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు ఎంఇఓ-2 స్టాలిన్ ఐజాక్ నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక భవిత కేంద్రంలో ఎపి మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో జీమ్ ఇకో సర్వీసెస్ ఎల్ఎల్ పి సహకారంతో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పన్నులు, రంగు పెన్సిల్, పలకలు, చాపలు పంపిణీ చేశారు. అనంతరం వేంపల్లెకు చెందిన మీరవల్లి, అయేషా దంపతులు విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరసింహరెడ్డి, భవిత కేంద్రం ఐఇఆర్టీ యశోధ, జీమ్ ఇకో సర్వీసెస్ ఎల్ఎల్‌పి డైరెక్టర్ లక్ష్మీ పావని, మదర్ థెరిస్సా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షాకీర్ హుస్సేన్, ఐఇఆర్టీ సుజాత, సిఆర్‌పి ప్రకాష్ రెడ్డి, సిజివి సుజాత , గౌసియా, అలీబాష, దివ్యాంగ చిన్నారులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి 'ఆది'కి లేదు

ప్రజాశక్తి -పులివెందుల టౌన్

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి బిజెపి నాయకులు ఆదినారాయణరెడ్డికి లేదని రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. 175 స్థానాల్లో వైసిపి తరపున ఎమ్మెల్యేలను, ఎంపీలను పోటీ చేయించే శక్తి ఉందని చెప్పారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి, జనసేన, బిజెపిలు మూడూ కలిసి 175 స్థానాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలను నిలబెట్టుకునే సత్తా లేదని వాపోయారు. సింగల్ పోటీ చేస్తే డిపాజిట్ కూడా రాదని తెలిపారు. ఎన్ని పార్టీలు ఏకమై వచ్చినా కూడా వైసిపి విజయాన్ని ఆపలేరని చెప్పారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి కలుపు మొక్క కాదు మహావృక్షం అన్నారు. ఆదినారాయణ రెడ్డికి వైఎస్ కుటుంబాన్ని విమర్శించే స్థాయి లేదని పేర్కొన్నారు. వైఎస్ కుటుంబ అండదండలతో ఎమ్మెల్యేగా గెచిన విషయాన్ని ఆదినారాయణరెడ్డి మరచి పోయారని చెప్పారు. ఆయనకు రాజకీయ బిక్ష పెట్టింది వైఎస్ కుటుంబమే అని తెలిపారు. విమర్శలు చేసేటప్పుడు కాస్త ఆలోచన చేయాలని హితవు పలికారు.

కిలో రూ.50కే టమోటాలు

- మార్కెట్ యార్డులో విక్రయం - బారులు తీరిన ప్రజలు

ప్రజాశక్తి -పులివెందుల రూరల్



బారుల తీరిన మహిళలు

టమోటా ధర అమాంతం పెరగడంతో, పులివెందుల మార్కెట్ యార్డ్‌లో కిలో రూ.50 విక్రయిస్తున్నారు. టమోటాల కోసం మహిళలు, పురుషులు శుక్రవారం ఉదయం నుంచి బారులు తీరారు. ప్రస్తుతం మార్కెట్లో టమోటాలు రూ. 150 పలుకుతుండడంతో సబ్సిడీతో సామాన్యులకు అందు బాటులోకి తెచ్చేందుకు మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ చిన్నప్ప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లిన విషయం అందరికీ తెలిసిందే. ఈ మేరకు అధికారులతో మాట్లాడి పులివెందులకు 40 టన్నుల టమోటాలను తెప్పించి విక్రయించారు. ఈ సందర్భంగా చైర్మన్ చిన్నప్ప మాట్లాడుతూ ఆదివారం మళ్లీ 40 టన్నుల టమోటాలు వస్తాయని అన్నారు. పట్టణంలో ప్రతి ఒక్కరికి టమోటాలను అందుబాటులోకి ఉంటాయని చెప్పారు. టమోటా ధర తగ్గేంతవరకు ఈ ప్రక్రియ యధావిధిగా కొనసాగుతూ ఉంటుందని ఆయన అన్నారు. ప్రతి రెండు, మూడు రోజులకు ఒకసారి 40 టన్నుల టమోటాలను సబ్సిడీ ధర రూ.50కు విక్రయిస్తామని చెప్పారు. టమోటాల కోసం ఎవరు అసహనం చెందవద్దని ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తెస్తామన్నారు. ఆధార్ కార్డుకు ఒక మనిషికి కిలో మాత్రమే అందజేస్తామన్నారు. ఎవరి ఆధార్ కార్డు వారే వచ్చి తీసుకువెళ్తే ఎలా ంటి ఇబ్బంది ఉండదని ఆయన అన్నారు.

యువత చూపు.. సీడాప్ వైపు

- నేడు ప్రపంచ నైపుణ్య దినోత్సవం

ప్రజాశక్తి - కడప అర్బన్



దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన అనేది భారత ప్రభుత్వ గ్రామీణాభివద్ధి మంత్రిత్వ శాఖ కార్యక్రమం. పేద కుటుంబాలకు చెందిన 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల గ్రామీణ యువతకు శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుంది. 'గ్రామీణ పేద యువతను ఆర్థికంగా, స్వతంత్రంగా ప్రపంచ వ్యాప్తంగా సంబంధిత శ్రామిక శక్తిగా మార్చడం' కార్యక్రమ లక్ష్యం.

రాష్ట్ర స్థాయి సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) అనే సంస్థ డిడియుజికెవై కార్యక్రమాన్ని అమలు చేసి ప్రతి పేద గ్రామీణ కుటుంబానికీ కనీసం ఒక ఉద్యోగాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేస్తోంది. 18-35 సంవత్సరాల మధ్య వయస్సు గల పాఠశాల /కళాశాల డ్రాప్ అవుట్‌లపై ప్రత్యేక దృష్టి సారించి వారికి ఉపాధి అవకాశాలను కల్పించడం సీడాప్ ముఖ్య ఉద్దేశం. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను అమలు చేయడానికి నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. నైపుణ్యం కల్గిన భాగస్వామి సంస్థగా ఉంది. నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ప్రధానంగా మార్కెట్‌లో స్థిరంగా ఉండే కోర్సులలో శిక్షణలను అందించడంపై దృష్టి సారిస్తోంది. సీడాప్, నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ నిరుద్యోగ యువతకు హెల్త్, ఎలక్ట్రానిక్స్ సెక్టార్‌ల నుంచి ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఇఎంటి)ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటింగ్ పెరిఫెరల్స్ (ఎఫ్‌టిపిసి), జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ రంగాల్లో 90 రోజుల ఉచిత రెసిడెన్షియల్ నైపుణ్య శిక్షణలను అందిస్తున్నాయి. ప్రొజెక్టర్‌లతో కూడిన తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్‌లు, డొమైన్ ల్యాబ్‌లు, యూనిఫారాలు, శిక్షణ సామగ్రి, ఆహారం, వసతి, పిఎంఎస్‌బివై, పిఎంజెజెబివై బీమాలు, అభ్యర్థులకు మరెన్నో సౌకర్యాలు కల్పించారు. అభ్యర్థులు 90 రోజుల శిక్షణను పూర్తి చేసిన తర్వాత, మంచి మొత్తంలో జీతం ఉన్న అభ్యర్థికి వంద శాతం ప్లేస్‌మెంట్ హామీ ఇస్తుంది.

గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ



గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పించడంలో మన రాష్ట్రం స్థానంలో ఉంది. గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణలో 3వ స్థానం, ఉపాధి పొందడంలో రెండో స్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ వెల్లడించింది.

-ఎం.కె.వి.శ్రీనివాసులు, సిఇఒ, సీడాప్.

విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - కొండాపురం

పట్టణంలోని 33/11 కె.వి సబ్ స్టేషన్‌లో సాధారణ మరమ్మతులో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మూడు గంటలపాటు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ శాఖ అధికారి ఓబులేసు ఒక ప్రకటనలో తెలిపారు. కొండాపురం సబ్ స్టేషన్ పరిధిలోని పారిశ్రామికవేత్తలు, రైతులు, వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

ఇస్రో చైర్మన్‌తో ప్రొద్దుటూరు చిత్రకారుడు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ఇస్రో చంద్రయాన్-3 యాత్ర శుక్రవారం ప్రారంభమై విజయవంతమైంది. ప్రొద్దుటూరుకు చెందిన చిత్రకారుడు రామాంజులరెడ్డి (మహేష్‌ఆర్ట్స్) ఇస్రో చైర్మన్ డా.ఎస్.సోమనాథ్ తన చిత్రపటాన్ని చిత్రీకరించి గతేడాది 22న బహూకరించారు. 'సేవ్‌గర్ల్‌చైల్డ్'ప్రాజెక్ట్‌తో బహూకరించిన ఈ చిత్రపటాన్ని చూసి సోమనాథ్ సందేశాత్మకంగా మాట్లాడారని రామాంజులరెడ్డి గుర్తు చేసుకున్నారు. స్త్రీలపై జరిగే అఘాయిత్యాలు ఆగాలంటే స్త్రీలు చదివి చైతన్యవంతం కావడం ఒక్కటే మార్గమని అన్నట్లు గుర్తు చేసుకున్నారు. చంద్రయాన్-3 విజయం సాదించడంతో అగ్రశ్రేణి దేశాలైన అమెరికా,రష్యా,చైనా సరసన భారత్ నిలిచి నట్టైందని రామాంజులరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.